ప్రజాశక్తి
శుక్రవారం 26 మే 2023
5
అనంతపురం

ప్రజాశక్తి వార్తకు స్పందన

కొండస్థలంలో నోటీస్ బోర్డు ఏర్పాటు

కొండ ప్రాంతంలో ఏర్పాటు చేసిన బోర్డు

బుక్కరాయసముద్రం : ప్రజాశక్తి కథనానికి అధికారులు స్పందించారు. బుక్కరాయసముద్రంలో 'కొండ'ంత అవినీతి అన్న శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో గురువారం ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై అధికార యంత్రాంగం కదిలింది. తహశీల్దార్ మోహన్‌కుమార్ ఉదయాన్నే అడ్డతిప్ప దగ్గర ఉన్న కొండ స్థలాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా ఈ స్థలం ప్రభుత్వానికి సంబంధించిన స్థలం అని, ఎవరైనా కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నోటీస్ బోర్డు ఏర్పాటు చేయించారు. నిజాలను వెలుగులోకి తెచ్చిన ప్రజాశక్తి దినపత్రికకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

బిర్యానీ...జాగ్రత్త సుమీ..!

- విచ్చలవిడిగా వెలుస్తోన్న బిర్యానీ పాయింట్లు
- నాశిరకం వంటలతో ఆరోగ్యానికి చేటు
- నిషేధిత రంగులు, ఎసెన్స్‌ల వినియోగం

బిర్యానీ... చాలా మందికి ఇష్టమైన ఆహార పదార్థం. బిర్యానీ ఎక్కడ బాగుందన్నా ఆ హోటల్ అడ్రస్ కనుక్కొని మరీ వెళ్లి అక్కడ తింటారు. మాంసాహార ప్రియులు అయితే చికెన్ ముక్కలేనిదే ముద్ద మింగరు. బిర్యానీకి డిమాండ్ పెరగడంతో చాలా మంది వ్యాపారులు చిన్నచిన్న బిర్యానీ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. రూ.80, రూ.90, రూ.100, రూ.120 ఇలా తక్కువ ధరలకే బిర్యానీని అందిస్తున్నారు. తక్కువ ధరలకే ముక్కతో కూడిన భోజనం లభిస్తోందన్న ఆశతో తినడం అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నట్లు అవుతోంది. చిరు వ్యాపారం పేరుతో ఎవరూ పడితే వారు బిర్యానీ పాయింట్ అంటూ విక్రయాలు చేస్తున్నారు. వారికి ఉపాధి లభించడాన్ని స్వాగతించాల్సిందే. అయితే ఈ ముసుగులో కొందరు వ్యాపారులు నాణ్యతలేని బిర్యానీని తయారు చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతుండడం ఆందోళనను కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి నాశిరకంగా బిర్యానీ సెంటర్లు అనేకం వెలిశాయి. కంటికి ఇంపుగా కన్పిస్తున్నాయని ఇలాంటి వాటిని తినడం వల్ల అనారోగ్యాన్ని కొని తెచ్చుకునే పరిస్థితులు నెలకొన్నాయి.



ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణ కేంద్రాల్లోనూ ఇబ్బడిముబ్బడిగా బిర్యానీ పాయింట్లు వెలుస్తున్నాయి. కార్పొరేట్ హోటళ్లలో అయితే రూ.300 నుంచి రూ.600వరకు బిర్యానీలను అమ్ముతున్నాయి. అదే బిర్యానీ పాయింట్లలో అయితే రూ.100కు లోపుగానే ఇస్తున్నారు. బిర్యానీ తక్కువ ధరకు వస్తుందంటూ లొట్టలేసుకుని తింటున్నారు. నాణ్యతలేని ఇలాంటి వాటిని తినడం వల్ల వాటిని తింటున్న వారు అనారోగ్యం పాలవుతున్నారు. అనంతపురం నగరంలో ఎక్కడ చూసినా ఏ ప్రధాన కూడలి చూసిన బిర్యానీ సెంటర్‌లే దర్శనమిస్తాయి. విద్యుత్ నగర్ సర్కిల్, ఆర్‌టిసి బస్టాండ్ సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, రాజు రోడ్, సుభాష్ రోడ్, తపోవనం, రుద్రంపేట బైపాస్, బెంగళూరు హైవేకి ఇరువైపులా, సంగమేష్ సర్కిల్, కలెక్టరేట్ సర్కిల్, రామ్‌నగర్, కళ్యాణదుర్గం రోడ్, బళ్లారి బైపాస్, వంటి కూడళ్లతో, వీధివిధినా బిర్యానీ సెంటర్లు వెలిశాయి. ఉమ్మడి జిల్లాలో ధర్మవరం, కదిరి, హిందూపురం, తాడిపత్రి, రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో అనేక బిర్యానీ సెంటర్లు ఉన్నాయి. కుటుంబానికి సరిపడే బకెట్ బిర్యానీ, బుట్ట బిర్యానీ, కుండ బిర్యానీ, బొంగులో బిర్యానీ, ఇలా అనేక ముద్దు పేర్లతో బిర్యానీ ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. ఈ బిర్యానీ పాయింట్లన్నింటికీ లైసెన్సులు ఉన్నాయా.. వీరిపై నియంత్రణ ఎవరు చూస్తున్నారు... ఒక వేళ తిన్నవారు అనారోగ్యం పాలైతే బాధ్యులెవరు అన్న ప్రశ్నలకు మాత్రం సమాధానం లేదు. అతి తక్కువ రేటుకు లభిస్తున్న బిర్యానీలో నాణ్యత ఏ మేరకు ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఆహార కల్తీ, నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఆహార భద్రతా విభాగం, నగర పాలక సంస్థ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వీటిపై ఎక్కడా పర్యవేక్షణ చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. భోజన ప్రియులను ఆకర్షించేందుకు బిర్యానీలో విచ్చలవిడిగా రంగులు, ఎసెన్స్ వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. అనంతపురం నగరంలో పేరు మోసిన రెస్టారెంట్‌లు మొదలు చిన్నా చితకా అన్ని బిర్యానీ సెంటర్లలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నవి మచ్చుకు కొన్ని మాత్రమే ఉంటున్నాయి. బిర్యానీ పాయింట్‌లు ప్రజల ప్రాణాల మీదకు తెస్తున్నా పట్టించుకునే పరిస్థితిలో అధికారులు లేనట్లు ఉంది. ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు మాత్రం అధికారులు హడావుడి చేసి, ఆ తరువాత మిన్నకుండిపోతున్నారు. ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్న మాంసాహార వంటకాలపై కల్తీ నియంత్రణ అధికారులు ఎందుకు దృష్టి సారించడంలేదన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

ఇష్టానుసారం వ్యాపారాలు

బిర్యానీ పాయింట్ల ఏర్పాట్లలో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి, ఇష్టాను సారం వ్యాపారాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విచ్చల విడిగా కొనసాగుతున్న బిర్యానీ పాయింట్లకు లైసెన్స్‌లు ఉన్న దాఖలాలు కనిపించడం లేదు. ఎక్కడికక్కడ రోడ్లపై పాయింట్‌లు ఏర్పాటు చేసుకుని విక్రయాలు చేస్తుంటారు. ఇలాంటి ఆహారం వల్ల ప్రజలకు ఏమైనా అనారోగ్యం సంభవిస్తే అందుకు బాధ్యులెవరన్న ప్రశ్నకు సమాధానం లేదు. నిల్వ ఉంచిన మాంసాహార పదార్థాలను భుజిస్తే క్యాన్సర్ బారిన పడతారని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చికెన్, మటన్, బిర్యానీ, తయారీల్లో ఎసెన్స్, సింథటిక్ రంగులు అధికరంగా వేస్తుండటంతో క్యాన్సర్ వంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. హోటల్స్‌లో చికెన్, మటన్, రొయ్యలు ఎక్కువ రోజులు డ్రీప్ ఫ్రిజ్‌లో ఉంచి వాడుతున్నారు. నిల్వ మాంసం తింటే అజీర్ణం సమస్యలు, ముఖ్యమైన అవయవాలు పని చేయకపోవటం వంటి సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆహార భద్రత ప్రమాణాలతో ఆహార పదార్థాలు విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'ఉపాధి'ని దూరం చేసే కుట్ర

- కూలీలకు అన్యాయం చేసేలా కేంద్రం నిర్ణయాలు
- విరివిగా ఉపాధి పనులు కల్పించాలి
- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు
- అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఆసరాగా నిలుస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు తెలిపారు. ఉపాధిని పరిరక్షించాలని, కూలీలకు మెరుగైన పనిదినాలు, వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం నాడు అనంతపురం కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి దడాల సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఏటా నిధుల కేటాయింపులు ఉపాధికి తగ్గిస్తూపోతోందని దుయ్యబట్టారు. దేశ వ్యాప్తంగా 20 కోట్ల మంది జాబ్‌కార్డులు కలిగిన కూలీలు ఉన్నారన్నారు. అందరికీ పని కల్పించాలంటే సుమారు రెండు లక్షల కోట్లు నిధులు ఉపాధి హామీ పథకానికి కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తోందని చెప్పారు. కేంద్రంలోని బిజెపి అందుకు విరుద్ధంగా గతేడాది రూ.90 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే, ఈసారి రూ.60 వేల కోట్లకే కుదించిందని తెలిపారు. తద్వారా ఉపాధి హామీ పనులను తగ్గించే కుట్ర చేస్తోందని విమర్శించారు. వ్యవసాయ క్షేత్రల్లో పనిచేసే కార్మికులకు దినసరి కూడా రూ.600 ఉంటే ఉపాధి హామీ కూలీలకు మాత్రం రోజు వారి కూలి రూ.270గా నిర్ధారించిందన్నారు. అది కూడా సక్రమంగా రావడం లేదని పేర్కొన్నారు. కొన్ని చోట్ల వంద లోపే రోజు కూలీ పడుతోందన్నారు. గతంలో ఇస్తున్న వేసవి అలవెన్సు 30 శాతానికి కోత పెట్టిందన్నారు. రవాణా ఛార్జీలు, గునపం పదును ఇచ్చే డబ్బులు అన్నింటిలోనూ కోతపెట్టిందని వివరించారు. ఉపాధి హామీ పథకం కింద సక్రమంగా వేతనాలందకపోయే సరికి అనంతపురం వంటి జిల్లాల నుంచి తిరిగి వలసలు పెరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. వేతనాన్ని రూ.600లకు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో పనిచేసిన ఉపాధి కూలీలకు కూలి సకాలంలో పడటం లేదని చెప్పారు. 25 రోజులుగా రూ.14 కోట్ల బిల్లులు పెండింగులోనున్నాయని చెప్పారు. పొమ్మనలేక పొగబెట్టినట్టు ఉపాధి హామీ పథకాన్ని పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేసే దిశగా కేంద్రం చర్యలు చేపడుతోందని విమర్శించారు. కొత్త నిబంధనలు మరింత ఇబ్బందికరంగా మారాయని చెప్పారు. ఇప్పటికైనా పాత పద్ధతుల్లోనే పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం కలెక్టర్ కార్యాలయంలోకెళ్లి డిఆర్‌ఒ గాయత్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, ఉపాధ్యక్షులు మల్లేష్, శంకర్, ఓబులేసు, సహాయ కార్యదర్శి భాస్కర్, నాగ లింగమయ్య, పెద్దయ్య, నిర్మల, కృష్ణవేణి, నాయకులు రాధాకృష్ణ, నాగప్ప, మల్లికార్జున, నారాయణరెడ్డి, వెంకట చౌదరి తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న దడాల సుబ్బారావు

అయ్యవారిపల్లెలో పేదలపై దౌర్జన్యం దుర్మార్గం

రెవెన్యూ, పోలీస్ అధికారులను శిక్షించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాప్తాడు మండలం అయ్యవారిపల్లి గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో నివాసమున్న పేదలపై తహశీల్దార్, ఎస్ఐ దౌర్జన్యానికి తెగబడడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని వారి భూముల ధరలు పెంచుకునేందుకు అధికార పార్టీ నాయకులు బరితెగించడాన్ని అన్ని పార్టీలు వ్యతిరేకించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్ కోరారు ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత 20 సంవత్సరాల క్రితం అయ్యవారిపల్లెలో బలహీనవర్గాలకు చెందిన పేదలకు అప్పటి ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేసింది. ఆ స్థలాల్లో ఇల్లు కట్టుకోవడంతోపాటు కొంత స్థలాన్ని ఖాళీగా పెట్టుకుని అందులో మేకలు, గొర్రెలు, పశువుల దొడ్లు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారని చెప్పారు. ఈ స్థలాలకు వెనుకవైపు ఆ గ్రామానికి చెందిన కొద్దిమంది వ్యవసాయ భూములను ప్లాట్లుగా వేసి అమ్ముకోవడానికి కొద్ది నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ స్థలాలకు డిమాండ్ రావాలంటే ముందు భాగాన ఉన్నా పేదల స్థలాల నుంచి రోడ్లు కావాలని వారిపై ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసిపి నాయకులు తహశీల్దార్ ఆఫీసు, పోలీస్ స్టేషన్‌లలో బెదిరింపులకు దిగారన్నారు. న్యాయం చేయాలని పేదలు ఆర్డీవోకు విన్నవించినా ఫలితం దక్కపోవడంతో కోర్టును ఆశ్రయించారన్నారు. సివిల్ విషయాల్లో తాము జోక్యం చేసుకోమని పోలీస్ స్టేషన్ల ముందు బోర్డులు ఏర్పాటు చేసి, అత్యధిక స్టేషన్‌లలో పోలీస్ అధికారులు సివిల్ పంచాయితీల్లో మునిగి తేలుతున్నారని విమర్శించారు. రెవెన్యూ అధికారులు సైతం నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి అధికార పార్టీ నాయకుల ఆదేశాలను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. అయ్యవారిపల్లె గ్రామంలో వివాదం కోర్టులో ఉండగా తహశీల్దార్, రాప్తాడు ఎస్ఐ చట్టానికి విరుద్ధంగా పేదల స్థలంలో ఉన్న బండలను కట్టడాలను బలవంతనా కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరు ప్రాణాలను కాపాడిన పోలీసులు

అనంతపురం నగరంలో రైలు కింద పడబోయిన తండ్రీ కొడుకులు..
గుత్తిలో చెరువులో దూకబోయిన తల్లీకూతుళ్లు..

రెండు వేర్వేరు సంఘటనల్లో వివిధ కారణాలతో బలవన్మరణానికి సిద్ధమైన ఆరుగురి ప్రాణాలను గురువారం పోలీసులు నిలబెట్టారు. అనంతపురం నగరంలో కుటుంబ సభ్యులతో గొడవ పడి ఓ తండ్రి ఇద్దరు కొడుకులతో కలిసి రైలు కింద పడేందుకు వెళ్లగా త్రీ టౌన్ పోలీసులు కాపాడారు. అలాగే గుత్తి పట్టణంలో భర్త వేధింపులు తాళలేక జీవితంపై చెంది ఓ తల్లి ఇద్దరు కుమార్తెలతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోబోతుండగా గుత్తి పోలీసులు రక్షించారు. ఆయా సంఘటనల్లో వేగంగా స్పందించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు అభినందించారు.

ప్రజాశక్తి-అనంతపురం, గుత్తి

నగరంలోని ఐదో రోడ్డుకి చెందిన గురజాల హరికృష్ణ కుటుంబ సభ్యులతో గొడవపడి తన కుమారులైన ప్రవీణ్, ప్రేమ్‌కుమార్‌లను తీసుకొని శివారులోని నేషనల్ పార్క్ దగ్గర ఉన్న రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నాడు. ఇద్దరు పిల్లలతో పాటు రైలు కిందపడి చనిపోతున్నామంటూ సెల్ఫీ ఫొటోను బంధువులకి పంపాడు. దీంతో వారు అప్రమత్తమై డయల్ 100కు సమాచారం ఇవ్వగా త్రీ టౌన్ సిఐ కత్తి శ్రీనివాసులు హుటాహుటిన రెండు పోలీసు బందాలను ఆ ప్రాంతానికి పంపారు. హెడ్ కానిస్టేబుల్ శివయ్య, కానిస్టేబుళ్లు ఆనంద్, రంజిత్, నరేష్ అక్కడికి చేరుకుని వారిని కాపాడి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. కౌన్సెలింగ్ అనంతరం వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనలో వెంటనే స్పందించి ముగ్గురి ప్రాణాలను కాపాడిన త్రీ టౌన్ సి.ఐ కత్తి శ్రీనివాసులుతో పాటు పోలీసులను ఎస్పీ కె.శ్రీనివాసరావు అభినందించారు.

చెరువులో పడబోగా..

గుత్తి : పట్టణంలోని బిసి కాలనీలో నివాసం ఉండే సూర్యనారాయణ మద్యానికి బానిసై కుటుంబ పోషణను విస్మరించాడు. దీనికి తోడు భార్యను చిత్రహింసలు పెడుతుండేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన భార్య కృష్ణవేణి ఇద్దరు కుమార్తెలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియో తీసి మొబైల్ ఫోన్ ఇంట్లోనే ఉంచి కుమార్తెలు మేఘన, శైలజలను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇంతలో ఇంటికి వచ్చిన సూర్యనారాయణ మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియో చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో అప్రమత్తమైన సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ బి.రామకష్ణారెడ్డి సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పట్టణ సమీపంలోని చెరువు కట్టపై కృష్ణవేణి ఇద్దరు కుమార్తెలతో ఉండడం గుర్తించి వారిని రక్షించారు. అలాగే సూర్యనారాయణకు పద్ధతి మార్చుకోవాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆత్మహత్య చేసుకోబోయిన తల్లీ కుమార్తెలను పోలీసులు రక్షించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అనంతపురంలో తండ్రీ కొడుకులతో పోలీసులు

విఆర్‌ఎల సమావేశంలో మాట్లాడుతున్న అంజి

హామీలు అమలు చేయకపోతే పోరాటాలు

విఆర్‌ఎల సంఘం రాష్ట్ర నాయకులు అంజి

ప్రజాశక్తి-గుంతకల్లు

సిఎం జగన్ పాదయాత్ర సమయంలో విఆర్ఎలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని విఆర్ఎల సంఘం రాష్ట్ర నాయకుడు కర్నూలు అంజి హెచ్చరించారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో గుంతకల్లు రెవెన్యూ డివిజన్ మండలాల విఆర్ఎల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు చేపట్టిన పాదయాత్రలో గ్రామ సేవకుల సమస్యలను 'నేను విన్నాను..నేను ఉన్నాను' అంటూ తమ ప్రభుత్వం వచ్చిన వారంలోపే గ్రామ సేవకులకు రూ.15వేలకు వేతనం పెంచుతానని, ప్రమోషన్లు కల్పిస్తామని, వారసత్వం కొనసాగిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయినా అందులో ఇప్పటికీ ఒక్కటి కూడా పరిష్కరించిన పాపానపోలేదన్నారు. దీనికితోడు ఉన్న జీతాల్లో కోతలు పెట్టడం బాధాకరమన్నారు. అలాగే ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయకపోవడంతో విఆర్ఎలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే విఆర్ఎలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం గుంతకల్లు రెవెన్యూ డివిజన్ విఆర్ఎల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సాకే నాగరాజు, అధ్యక్షుడిగా రాము, కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్, సహాయ కార్యదర్శిగా రమేష్‌తోపాటు 15 మంది డివిజన్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు సాకే నాగరాజు, విఆర్ఎ సంఘం నాయకులు రంగనాథ్, రామాంజనేయులు, సుబ్రహ్మణ్యం, రాజశేఖర్ గుత్తి, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత : ఎస్పీ

ప్రజాశక్తి-కుందుర్పి

బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు సంభవిస్తాయని గుర్తెరిగి వాటిని నిరోధించడం అందరి కర్తవ్యమని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల పరిధిలోని వడ్డేపాళ్యం గ్రామంలో గురువారం బాల్య వివాహాల నిరోధంపై సదస్సు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం బాలికకు 18 ఏళ్లు, బాలుడికి 21 ఏళ్లు నిండకుండా పెళ్లి చేసినా, ప్రోత్సహించినా నేరమని, అలాంటి వారికి కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. చిన్న వయస్సులో పెళ్లి చేయుడం వల్ల ఆడపిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. చదువు, ఆటపాటలతో ఎదగాల్సిన పిల్లలు బలహీనమవుతారన్నారు. శారీరక, మానసిక పరిపక్వత లేని సమయంలో గర్భిణులైతే మాతా శిశువురణాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. చిన్న వయసులోనే పెళ్లి చేయడం వల్ల కుటుంబ భారం మీద పడుతుంది. అవగాహన లేమి వల్ల ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయి, వీటిని తట్టుకునే మానసిక పరిపక్వత లేకపోవడంతో కుటుంబం చిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు. ఎక్కడైనా చిన్నపిల్లలకు పెళ్లి జరుగుతున్నట్టు తెలిస్తే వెంటనే 1098 లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లో చేయబోమంటూ గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. సదస్సులో కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, సి.ఐ తేజోమూర్తి, ఎస్ఐ కష్ణమూర్తి, ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

రాప్తాడు ఇన్‌ఛార్జి తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

సిపిఎం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాప్తాడు మండలంలోని అయ్యవారిపల్లిలో దాదాపు 50 ఏళ్ల కిందట కట్టుకున్న ఇళ్లు, ప్రహరీలను తొలగించిన ఇన్‌ఛార్జి తహశీల్దార్ నరసింహులు వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప డిమాండ్ చేశారు. ఈమేరకు సిపిఎం, కెవిపిఎస్, రైతుసంఘం, సిపిఐ, వడ్డెర్ల సంఘాల ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాప్తాడు మండల అయ్యవారిపల్లి గ్రామ సర్వే నంబర్ 420-2లో ఏడుగురు అధికార పార్టీ మద్దతుదారులకు భూమి ఉందన్నారు. అయితే ఆ భూమికి ఏడు చోట్ల దారి ఇప్పించేందుకు ఏకంగా మండల ఇన్‌ఛార్జి తహశీల్దార్ రంగంలోకి దిగి 50 ఏళ్ల కిందట నిర్మించుకున్న పశువుల కొట్టాలు, ప్రహరీలను కూల్చివేయడం బాధాకరమన్నారు. రికార్డులో 25 అడుగుల వెడల్పుతో రోడ్డు ఉంటే ఇన్‌ఛార్జి తహశీల్దార్ మాత్రం 47 అడుగుల వెడల్పుతో ఏడు చోట్ల రోడ్డు వేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. వెంటనే సంబంధిత ఇన్‌ఛార్జి తహశీల్దార్‌పై చర్యలు తసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందుకు స్పందించిన ఆర్‌డిఒ మధుసూదన్ రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాప్తాడు సిపిఎం మండల కార్యదర్శి పోతులయ్య, సిపిఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, ఎస్సీ, ఎస్టీ జెఎసి కన్వీనర్ హరి వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న నల్లప్ప

నాడు-నేడు పనుల వివరాలను తెలుసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

నాడు-నేడు పనుల పరిశీలన

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో నాడు, నేడు పథకం కింద చేపట్టిన పనులను అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాడు-నేడు పథకం కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల మండల విద్యాశాఖ అధికారి నరసింహారెడ్డికి ఆదేశాలు జారీ చేశారు ఈ కార్యక్రమంలో సచివాలయం ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శివరామిరెడ్డితో 'జూపూడి' భేటీ

ఉరవకొండ : వజ్రకరూరు మండల పరిధిలోని కొనకొండ్ల గ్రామంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సొంతిట్లో రాష్ట్ర ప్రభుత్వ అడ్వైజర్ (సోషల్ జస్టిస్) జూపూడి ప్రభాకర్ గురువారం భేటీ అయ్యారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. అనంతరం కార్యకర్తల సమక్షంలో జూపూడి ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు.

జూపూడితో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

చేతిపంపు ఏర్పాటు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జకాట్ సంస్థ సహాయ, సహకారంతో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి నేతత్వంలో సర్పంచి ఎగిరి వరలక్ష్మి ఆధ్వర్యంలో బోరు వేయించడంతోపాటు హ్యాండ్ పంపును వితరణ చేశారు. ఆత్మకూరులో నీటి కొరత ఎక్కువగా ఉందని పరిష్కరించాలని జకాట్ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారిని సర్పంచి సంప్రదించగా వెంటనే స్పందించిన సంస్థ కోఆర్డినేటర్ షేక్ నూర్ మొహమ్మద్ సహకారంతో బోర్ వేయించి హ్యాండ్ పంపు బిగించారు.

బోరును ఓపెన్ చేస్తున్న జకాట్ సంస్థ సభ్యులు

పారదర్శకంగా ప్రభుత్వ పాలన

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి ప్రభుత్వం వచ్చాక సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థల ద్వారా అర్హులందరికీ పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని ఆర్డీ కార్యాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో అవినీతికి పాల్పడ్డారని గుర్తు చేశారు. అదే వైసిపి అధికారంలోకి వచ్చాక దేశంలోనే ఎక్కడా లేనివిధంగా సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల ఇంటి ముంగిటికే పథకాలు అందజేస్తున్న ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. నగరంలో ఎన్నడూ లేనివిధంగా రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ అభివృద్ధిని రానున్న రోజుల్లో ప్రజలకు వివరిద్దామన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ప్రజలకు మంచి చేయాలన్న మంచి ఉద్దేశంతో సిఎం జగన్ సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను తీసుకొస్తే ఓర్చుకోలేని టిడిపి నాయకులు తాము అధికారంలోకి వస్తే తొలగిస్తామని చెప్పడం బాధాకరమన్నారు. రానున్న ఎన్నికల్లో మరోమారు అధికారంలోకి తీసుకురావానికి కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్లు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, చింతకుంట మధు, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, కమల్‌భూషణ్, మీనాక్షి, రమాదేవి, కమిషన్ రమణారెడ్డి, నాయకులు నాగార్జునరెడ్డి, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

నార్పల : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే సిఎం జగన్ ధ్యేయమనిఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని షాదీఖానాలో గురువారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యంలో భాగంగా జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. దీంతో ఇతర రాష్ట్రాల నాయకులు రాష్ట్రం వైపు చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏం కావాలన్నా సిఫారసులు ఉంటేనే జరిగేవన్నారు. అదే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా 1వ తేదీనే వాలంటీర్లు వచ్చి పింఛన్ సొమ్మును అందజేస్తున్నారన్నారు. అంతేగాకుండా ప్రభుత్వం పథకాలను సైతం ఇంటింటికీ అందజేస్తున్నామన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వాలంటీర్లకు సేవారత్న పథకాలను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి, జిల్లా వైస్‌ఛైర్పర్సన్ వేదాంతం నాగ రత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, ఎంపిడిఒ దివాకర్, సర్పంచి సుప్రియ, సింగిల్‌విండో అధ్యక్షులు లోకనాథ్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, ఉప సర్పంచి శ్రీరాములు ఎంపిటిసిలు, సర్పంచులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

త్వరలో నగరంలో అన్న క్యాంటీన్లు

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

త్వరలో నగరంలో అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి తెలిపారు. ఈమేరకు గురువారం రుద్రంపేట పంచాయతీలో ఏర్పాటు చేసిన టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో భాగంగానే నాలుగు పంచాయతీల్లో పార్టీ కార్యాలయాలను ప్రారంభించామన్నారు. ఇటీవలే రాజీవ్ కాలనీ, చంద్రబాబు కాలనీలో ప్రారంభించామన్నారు. ఇప్పుడు రుద్రంపేట పంచాయతీలో ప్రారంభించామన్నారు. నిర్మాణాత్మకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, సంస్థాగతంగా పార్టీని పటిష్టం చేసుకుంటూ, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లో చాటి చెప్పిన టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాన్ని అందించిందని గురుత చేశారు. ఇందులో భాగంగానే ఇటీవలే నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నగరంలో దిగ్విజయంగా పూర్తయిందన్నారు. వైసిపి ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెందారన్నారు. ఈనేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో టిడిపికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం పలువురు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి గోపాల్‌గౌడ్, ఎస్ఎం బాషా, బోయపాటి బాలప్ప, మారుతీనాయుడు, వడ్డే మురళి, గోపాల్‌నాయుడు, గంగవరం అంజి, గంగవరం శివ, వెంకటేష్, శ్రీనివాసులు, గుత్తా వెంకటేష్, ఉప్పర శీన, పుల్లన్న, లక్ష్మన్న, నారాయణస్వామి, బొల్లినేని నరేంద్ర, సిద్ధప్ప, సుజాత, రాములమ్మ, రేణుక, ఆదిలక్ష్మి, అఖిల, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-తాడిపత్రి

ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి క్రీడాకారులను ప్రోత్సహించాలని విశ్రాంత ఉపాధ్యాయులు శివయ్య, కత్తి రామచంద్రారెడ్డి, షామీర్‌బాషా, జయరామిరెడ్డి కోరారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో స్థానిక సాయి చైతన్య పాఠశాల ఆర్థిక సహకారంతో నిర్వహించిన కబడ్డీ శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో క్రీడాకారులు ఎన్నో రకాల ఇబ్బందులు, సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా క్రీడాకారిణుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. దీంతో చాలామంది క్రీడాకారిణులు క్రీడలకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మారాలన్నారు. అలా జరగాలంటే యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం శిక్షణ శిబిరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. అంతేగాకుండా శిబిరంలో శిక్షణ పొందిన అమీనా అండర్-19 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో అభినందించారు. ఈ కార్యక్రమలంఓ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వరుణ్, ఉచిత కబడ్డీ శిక్షణ శిబిరం కోచ్ నరసింహా, క్రీడాకారులు, విశ్రాంత ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పొందిన విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ నాయకులు, అతిథులు

డంపింగ్ యార్డును నగరానికి దూరంగా తరలించాలి

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక గుత్తి రోడ్డులోని మార్కెట్ యార్డు వద్ద ఉన్న డంపింగ్ యార్డును నగరానికి దూరంగా తరలించాలని జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక జనసేన నాయకులతో కలిసి గురువారం డంపింగ్ యార్డు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పాలకులు మారుతున్నా డంపింగ్ యార్డు మారడం లేదన్నారు. నగరం రోజురోజుకూ విస్తరిస్తున్న నేపథ్యంలో డంపింగ్ యార్డు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా ఇంతవరకూ డంపింగ్ యార్డు తరలించలేదన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయపోవడం వల్ల తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని, దీనికితోడు రాత్రి సమయంలో నిప్పు పెట్టడం వల్ల స్థానికులు శ్వాసకోస జబ్బులు వస్తున్నాయన్నారు. అంతేగాకుండా జాతీయ రహదారి సమీపంలో ఉండటం కారణంగా పొగతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. కావున తక్షణమే డంపింగ్ యార్డును నగరానికి దూరంగా తరలించాలని, లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య, జయరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, రాప్తాడు ఇన్‌ఛార్జి పవన్‌కుమార్, జిల్లా కార్యదర్శులు ధనుంజయ, సంజీవరాయుడు, కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు అవకు విజయకుమార్, ముప్పూరి కృష్ణ, నగర ఉపాధ్యక్షుడు జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, నగర కార్యదర్శులు మురళి, సంపత్ ఆకుల అశోక్, నాయకులు చరణ్, వడ్డే వెంకటేష్, హిందూ నౌషాద్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వద్ద మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

చిత్తశుద్ధితో పనిచేయాలి : ఎస్పీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసు అధికారులు చిత్తశుద్ధితో పని చేసి, వారి మన్ననలు పొందాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో గురువారం డీఎస్పీ బి.శ్రీనివాసులు అధ్యక్షతన కళ్యాణదుర్గం పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు బృందితో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసుల విధులు, బాధ్యతలను గుర్తుచేశారు. సమాజంలో పోలీసులంటే ఓ రకమైన అభిప్రాయం ఉందన్నారు. కావున ప్రతి పోలీసు అధికారి ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసినప్పుడే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ప్రజలకు న్యాయం చేసినప్పుడే వృత్తికి న్యాయం చేసిన వారవుతారన్నారు. అసాంఘిక కార్యక్రమాలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించడంతో పాటు అవాంఛనీయ ఘటనలను ఎప్పటికప్పుడు ప్రతిఘటించాలన్నారు. గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలు చెలరేగకుండా ప్రత్యేక భద్రత వహించాన్నారు. కార్యక్రమంలో సీఐలు తేజోమూర్తి, శ్రీనివాసులు, లక్ష్మన్న, యుగంధర్, ఎస్ఐలు మధు, అనిత, ఆశాబేగం, రాజేష్, యువరాజు, శివ, పరశురాముడు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల తనిఖీ

గార్లదిన్నె : మండల కేం ద్రంలోని ఎపి మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల (బాలుర)ను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థుల వసతులపై పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా తరగతి, హాస్టల్ గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పాఠశాల సిబ్బంది జెసి దృష్టికి తీసుకొచ్చారు. విద్యార్థుల సంఖ్యను బట్టి కనీసం 12 గదులు ఉండాలని, అయితే 9 గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఇందుకు జెసి స్పందిస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులతో చర్చించి విద్యార్థులు అనుగుణంగా తరగతి గదులు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉషారాణి, ఎంఇఒ తారా చంద్రానాయక్, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డుపల్లికి చేరిన సబ్సిడీ విత్తనకాయలు

ఆత్మకూరు : మండల పరిధిలోని వడ్డుపల్లి గ్రామానికి గురువారం విత్తన వేరుశెనగ కాయలు చేరాయి. దీంతో విత్తన కాయల నాణ్యతను ఎఇఒ సుజిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఇఒ మాట్లాడుతూ వేరుశనగ విత్తన కాయలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె రైతులకు తెలిపారు రైతులు విత్తన కాయ నాణ్యత పై పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పి.లక్ష్మీనారాయణరెడ్డి, వడ్డుపల్లి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు

గుత్తి : బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించే సచివాలయ ఉద్యోగులపై చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని 5, 8, 9వ సచివాలయాలను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూమెంట్ రిజిస్టర్, డ్రెస్‌కోడ్, రోజువారి పనుల వివరాలను రోజూ తప్పనిసరిగా రాయాలన్నారు. బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం నేమితాబాదు, చెట్నేపల్లి జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. ఇందులో భాగంగా తాగునీరు సరఫరా, తాగునీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మతులు, హౌసింగ్ నిర్మాణాలను పర్యవేక్షించారు. అలాగే ప్రధాన రహదారుల్లో పర్యటించి పారిశుధ్యంపై అవగామన కల్పించారు. దుకాణదారులు చెత్తను రోడ్లపై వేయకుండా సొంతంగా బుట్టలను ఏర్పాటు చేసుకుని అందులో వేయాలన్నారు.

శ్మశానవాటికకు హద్దులు చూపాలి

బొమ్మనహాల్: శ్మశానవాటిక హద్దులు చూపాలని కోరుతూ గురువారం మండల పరిధి లోని గోనెహాల్ గ్రామానికి చెందిన ముస్లిములు తహశీల్దార్ శ్రీనివాసులుకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముస్లిములు విలేకరులతో మాట్లాడుతూ గతంలో రెవెన్యూ అధికారులు సర్వే నంబర్-249లో శ్మశానవాటికకు ప్రభుత్వ భూమిని చూపించారు. అయితే ఆ భూమి సమీపం లో ఓ రైతుకు భూమి ఉన్నందున అతను శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేశారని తెలిపారు. కావున రెవెన్యూ అధికారులు స్పందించి శ్మశానవాటిక స్థలం ఎంత ఉందో నాలుగు మూలల హద్దులు చూపించాలని వారు కోరారు. వినతి ఇచ్చిన వారిలో డాక్టర్ ఖాదర్ బాషా, వలి బాషా, దర్గా బాషా, మాజీ ఎంపిటిసి వెంకటేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసేవ అందరి బాధ్యత

కళ్యాణదుర్గం : ప్రజాసేవ అందరి బాధ్యత అని వికెసి పార్టీ, భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి మండల రమేష్ పేర్కొన్నారు. పట్టణంలో గురువారం మార్క్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు ప్రజలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో వైద్యులు, సిబ్బంది, వికెసి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి

పుట్లూరు : మండలంలో బాల్య వివాహాలు నివారించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంపిడిఒ యోగానందరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బంతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వీటిని నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వాటితో పాటు జనన మరణాలు గుర్తించి ఎప్పటికపుడు రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. పిఎం హౌసింగ్ నిర్మాణాలు, నాడు నేడు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనంద్, హౌసింగ్ ఎఇ లోకేష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టిఎస్ ఎంసెట్‌లో నారాయణ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

గురువారం నాడు వెలువడిన తెలంగాణ ఎంసెట్ ఫలితాలు అనంతపురం నారాయణ కళాశాల విద్యార్థి భూపతి నిఖిల్ అగ్నిహోత్రి ప్రతిభ చాటాడు. 291వ ర్యాంకును సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాల ఈ విద్యార్థినిని కళాశాల డీన్ బద్రీనాథ్, వెంకటరామిరెడ్డి అభినందించారు.

తెలంగాణ ఎంసెట్‌లో అనంత శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

అనంతపురం : గురువారం వెలువడిన తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో అనంతపురం శ్రీ చైతన్య విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. అనంత శ్రీ చైతన్య కళాశాలకు చెందిన రెగ్యులర్ డే స్కాలర్స్ దొనకొండ చైతన్య 468, షేక్ జోహార్ 1808, గుర్రం పవన్ కార్తికేయ 3034, షేక్ ఖాజీ ముగ్ధం 4601వ ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఏటీఎం మురళీకృష్ణ, ప్రిన్సిపల్ ఆంజనేయులు దుర్గేష్ , రవికుమార్, కిషోర్ కుమార్‌లు అభినందించారు.

ప్రతిభ చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

నేరాలు ఘోరాలు

నీటి సంపులో పడి కార్మికుడు మృతి

మృతిచెందిన ప్రసాద్

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని చుక్కలూరు పారిశ్రామిక వాడలో నీటి సంపులో ప్రసాద్ (43) పడి మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదోనికి చెందిన ప్రసాద్ వలస వచ్చి తాడిపత్రి నల్లబండల పారిశ్రామిక వాడలో ఉన్న వెంకటేశ్వర స్లాబ్స్ పరిశ్రమలో పనులు చేస్తున్నాడు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి పరిశ్రమ ఆవరణలో ఉన్న నీటి సంపులో నీటిని తోడుకునేందుకు వెళ్లాడు. అప్పటి నుంచి గురువారం ఉదయం వరకూ ప్రసాద్ కనిపించలేదు. దీంతో యజమాని కృష్ణారెడ్డి తోటి కార్మికులతో కలిసి ప్రసాద్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నీటి సంపులో ఒక ప్లాస్టిక్ బిందె తేలియాడుతూ, బయట ప్రసాద్‌కు చెందిన చెప్పులు ఉండడంతో అనుమానం వచ్చి నీటి సంపులో వెతికారు. దీంతో సంపులో ఉన్న ప్రసాద్ మృతదేహాన్ని బయటకు తీశారు. వెంటనే రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎఎస్ఐ కాటమయ్య ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదోనిలో ఉంటున్న భార్య రూతూకు సమాచారం అందించారు. మృతుడికి ఇరువురు కుమారులు ఉన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

గార్లదిన్నె : మండల పరిధిలోని తిమ్మంపేట చెరువులో గురువారం మధ్యాహ్నం అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే... తిమ్మంపేట చెరువులో వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందడాన్ని గమణించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించి మృతుని దగ్గర ఉన్న ఫోన్ ఆధారంగా అనంతపురం చెందిన బాలశంకరయ్యగా గుర్తించారు. మతునిపై అనంతపురం నాలుగో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోతైనట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతిచెందిన వ్యక్తి

పోక్సో కేసులో ఉపాధ్యాయుడికి మూడేళ్ల జైలు

అనంతపురం కలెక్టరేట్ : గుత్తి పట్టణం కోట ప్రాంతంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సాలవేముల బాబుకు పోక్సో కేసులో మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ అనంతపురం పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి గురువారం తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళ్తే.. సాలవేముల బాబు అదే పాఠశాలలో చదువుతున్న ఓ బాలిక పట్ల అసభ్యంగా మాట్లాడటంతోపాటు లైంగికంగా బలవంతం చేశాడు. సదరు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు గతేడాది ఫిబ్రవరి 17న గుత్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి సిఐ శ్యాంరావు దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదిక కోర్టుకు సమర్పించారు. అన్ని కోణాల్లో విచారించిన అనంతపురం స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి నిందితుడికి మూడేళ్లు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

పలు గ్రామాల్లో మాజీమంత్రి పర్యటన



మాట్లాడుతున్న మాజీమంత్రి శైలజానాథ్

శింగనమల : మాజీమంత్రి శైలజానాథ్ గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఇందులో భాగంగా మండలంలోని వెస్టు నరసాపురం, ఆకులేడులో పర్యటించి రైతులు, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెస్టు నరసాపురం గ్రామంలో ఉన్న ఆనంద్‌రెడ్డి ఇంటికి వెళ్లి పలకరించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు దాదాగాంధీ, మాజీ ఎంపిటిసి పూల ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు విష్ణునారాయణ, కాంగ్రెస్ పార్టీ ఒబిసి జిల్లా ఛైర్మన్ రామ్‌చరణ్ యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి ఫక్రుద్దీన్, గార్లదిన్నె మండల కన్వీనర్ ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పాసవ్వాలి : ఎంపిపి

విద్యార్థులతో మాట్లాడుతన్న ఎంపిపి సునీత

బుక్కరాయసముద్రం : పదవ తరగతిలో ఫెయిలైన విద్యార్థులు ఈసారి తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పాసయ్యేందుకు కృషి చేయాలని ఎంపిపి సునీత సూచించారు. గురువారం మండల పరిధిలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టడీ క్లాసులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఫెయిలైన విద్యార్థుల కోసం ప్రభుత్వం స్టడీ సెంటర్ ఏర్పాటు చేసి తరగతులు నిర్వహిస్తోందన్నారు. కావున అధ్యాపకులు ప్రతి ఒక్కరూ పాసయ్యేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్లు, సిఆర్‌టిలు పాల్గొన్నారు.

మండలమీట్‌లో సమస్యల